మీద ఉమ్మేస్తారు. ఆకాశాన్ని తిడతారు. సముద్రాన్ని కాలితో తంతారు. వీళ్ళని కూడా నటస్మ్రాంద్రల్స నొచ్చు. ఇంతకీ నట పూల్సెవరని మీరడగొచ్చు. ఇంకెవరు? ఇన్ని బాధలు పడే మనమే. ఏడ్వలేక నవ్వుతూ తిరిగేస్తాము.

ఆ నటపూల్సుమి మనమే; మనమే;

---

# 'దేశ భాషలందు తెలుగు లెస్స'

'మమ్మీ డాడీ' చదువు లొచ్చాక 'తల్లీ నిన్ను దలంచి పుస్తకము' ఎగిరి పోయింది. నన్నడిగితే 'వేయిపడగలు' విలవ పెరిగిందంటాను. కాన్వెంటు చదువు లొచ్చాక అన్ని పడగలూ పోయి ఆ వున్న ఒక పడగకూడా ఎగిరిపోయింది. తెలుగు 'మమ్మీ'ల వ్యామోహం పుణ్యాన విశ్వనాధ వారు వేయిపడగల్లో తిట్టిన దానికన్నా ఎక్కువ తిట్టాలి. 'మమ్మీ డాడీ కల్చరు' కోసం తెలుగుతనాన్ని, తెలుగు ఆత్మాభిమానాన్ని, తెలుగు పౌరుషాన్ని మంట కలిపేస్తున్న తెలుగు 'మమ్మీ'ల్ని.

భాగవతంలో శ్రీకృష్ణుడు మన్ను తిన్నాడని యశోద నోరు తెరవమన్నపుడు ఆ చిన్ని కృష్ణుడు మమ్మీ మన్ను తినగం నేశిశువునో ఆకొంటినో వెర్రినో" అని చదవాల్సిన పరిస్థితి యిప్పుడొచ్చింది. నోరారా యింటికి రాగానే పిల్లలు 'అమ్మా' అనకుండా యీ 'మమ్మీ' గోలెక్కడ్నుంచి వచ్చి పడిందర్రా అని మా మేనత్తగారు 'మమ్మీ - డాడీ' గాళ్ళని తిట్టిన తిట్టు తిట్టకండా దులిపేస్తూ వుంటారు కాని. మమ్మీడాడీ గాళ్ళకు 'నర్సరీ రైమ్స్ డింగ్ డాంగ్ బెల్లూ' తెలిసి నట్లు - కృష్ణ శతకం, సుమతీ శతకం దాశరథీ శతకాలు తెలవ్వు కదా; అంచేత విశ్వనాధవారు యింకా రెండు పడగలున్నాయని ఆ నవల్లో పొంగిపోయారు కాని కాన్వెంట్ల పిచ్చి గురించి వారుకాసుకోలేక పోయారు. ఆరెండు పడగల్నీ కూడా తెలుగు మమ్మీలు వూడగొట్టేశారు గోవిందా అని.

ఓ సారి లండన్లోనో మాంచెస్టర్లోనో విగాన్ అనే చోటనో వో టాక్సీ డ్రైవరు మా వారి ఇంగ్లీషు భాషాజ్ఞానాన్ని మెచ్చుకుంటూ - మీకు ఇంత ఇంగ్లీషు మా చరిత్ర మా సాహిత్యం గురించి ఎలా తెలుసు అని అడిగాడ్ట. దాన్తో పొంగిపోయి ఆయనో టాక్సీవాడికి చిన్నప్పటినుంచీ అనగా ఫస్ట్ఫాం నుంచీ డిగ్రీదాకా అంతా ఇంగ్లీషేకదా మేంచదివిందీ అని గొప్పగా చెప్పార్ట. అప్పుడా డ్రయివరు "మీకు మాతృభాషలేదా ఆ భాషలో మీరు ఎందుకు చదువుకోరు" అని ప్రశ్నించాడ్ట. ఇంగ్లీషువాళ్ళు మాదేశాన్ని పరిపాలించారు. అప్పుడు వాళ్ళ చదువులు చదువుకోవడానికి యింగ్లీషు నేర్చుకున్నాను. మా కంట్రీలో మద్రాసు అని వో వూరుంది. అక్కడ యింగ్లీషు తీసేస్తామంటే కొందరు కిరసనాయిలు మీదోసుకుని చచ్చారు. మా

వాళ్ళకింగ్లీషంటే పరమ ప్రీతి – మీకంటే మాకు పుస్తకభాష. గ్రామరు వగైరా బాగా వచ్చునని మా వారు అన్నార్ట. కాని ఆ టాక్సీ డ్రయివరు మీ మాతృభాషలోనే మీవాళ్ళు ఎందుకు చదువుకోరు అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయార్ట.

శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద' కావ్యంలో 'మాలదాసరి కథలో' మాలదాసరిచేత బ్రహ్మరాక్షసునికి జ్ఞానోపదేశం చేయిస్తాడు. అంత గొప్ప కథ చదువుకునే అదృష్టం మనవాళ్ళకి వుండద్దూ?

ఈ సోదంతా ఎందుకు ఏకరువు పెట్టాల్సొచ్చిందంటే – దసరా వచ్చిందంటే దసరా వేషాల్లేవు అమ్మవార్ల వూరేగింపులు లేవు. పాటలూ పద్యాలూ లేవు. పజ్యాలంటే జ్ఞాపకం వచ్చింది. దసరా వస్తుందనగా గిలకలు పట్టించి గిలకల పద్యాలు యింటింటికీ పంతులుగారు తీసుకెళ్ళి చదివించేవారు. 'జయాభిజయభవ దిగిజయభవ' అని వచ్చీ రాని ముద్దు మాటలతో పిల్లలువచ్చి యింటి ముందు నిలబడి పద్యాలు చదివితే ఆనందించని తెలుగుతల్లి వుండేదా?

ఆ మధ్యన మా వూరెళ్ళినపుడు మా ఇంట్లో అశుభం జరిగితే కర్మలు చేయించడానికి పురోహితుడుగారు "రాజదూత్" లో వచ్చాడు. ఆయన త్వర త్వరగా చేయమని మావాడ్ని స్పీడప్ చేస్తున్నాడు. ఏవిటయ్యా అంటే వాళ్ళ అమ్మాయిని పాలకొల్లు తీసుకెళ్ళి కాన్వెంట్లో అయిదొందలు డొనేషన్ కట్టి చేర్పించాలట. పిచ్చి కుదిరింది రోకలి తలకుచుట్టమన్నట్లుంది యవ్వారం. ఇంగ్లీషు స్పెల్లింగులు సరిగా రాకపోయినా. ఇంగ్లీషు గ్రామరు సరిగా రాకపోయినా "ఫాక్స్ ట్రైల్ కాన్వెంటు" అనో "ఆక్స్ ఫోర్డ్ లిటిల్ చిల్డ్రన్స్ కాన్వెంటు" అనో పేరు కనపడ్డంతోపాటు శ్వేతవస్త్రాంబరధారిణు లైన మలయాళీ రోమన్ కేతలిక్ నన్నమ్మలు రుసరుసమంటూ విసుక్కుంటూ తిరుగుతూ కనిపిస్తే చాలు మన వాళ్ళకి "స్నూ్క" లూజయి వాళ్ళకి పాదాభివందనాలు చేసేస్తారు.

మళ్ళీ కాన్వెంట్లకి 'గాంధీ కాన్వెంటు', 'నెహ్రూ కాన్వెంటు', 'శారదాకాన్వెంటు' అని మనవాళ్ళ పేర్లు. మన దేవుళ్ళ పేర్లు పెడితే చెలామణీకావు. ఇలాటి వాళ్ళకి 'అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయమ్ము స్థాపించునాడు' అంటే 'గో టు హెల్' అంటారు. అసలిలాటి సంతతికోసమా మన పెద్దలు తిలక్, గోఖలే, గాంధీలు స్వరాజ్యం తెచ్చింది?

చిత్రం ఏవిటంటే విదేశాలలో వున్న తెలుగువారు మన మతం, మన సంస్కృతి, మన ఆచార వ్యవహారాలు, మన పద్ధతులంటే పడిఛస్తారు. పద్యం ఎలా తెలుగు వాడి సోత్తో పచ్చడి అలాగ తెలుగు వాడికి ప్రియాతి ప్రియమైనది.

పోతన్నగారు "అమ్మలగన్న యమ్మ" అని ఎంతో భక్తిగా చెప్పారు గాని "మమ్మీల గన్న మమ్మీ" అని అన్లేదు గదా! నాన్నగారూ నాన్నా అని పిలిపించుకోవడంలో వున్న ఆప్యాయత డాడీ లాగ డాడీ అంటే వస్తుందా? ఈ చదువులు మన జీవితం నుంచి మనల్ని వేరుచేస్తున్నాయి. మన పిల్లల్ని జ్ఞానశూన్యులుగా తీర్చిదిద్దుతున్నాయి.

తెలుగు భాష ఎలా వుంటుందో తెలుసుకోవాలంటే కుటుంబాలలోని ఆడవాళ్ళతో మాట్లాడితే తెలుస్తుంది అని ఒకప్పుడు అనుకునేవాళ్ళం ఇప్పుడంతా యిళ్ళలో భార్యాభర్తలూ పిల్లలతో మాట్లాడ్డం అంతా యింగ్లీషులోనే - తెలుగు కుర్రాళ్ళూ తెలుగు ఆడపిల్లలూ ప్రేమలేఖల్ని కూడా ఇంగ్లీషు లోనో హిందీలోనో రాసుకునే పిదపకాలం వచ్చేసింది. ఏవీ లేకపోయినా దసరా మామూళ్ళు మాత్రం నిలబడిగోకేస్తున్నాయ్ జనాన్ని.

లండన్లో ఆర్నెల్లయి ఏదో వుద్యోగం చేస్తున్న కుర్రాడు గోంగూర పచ్చడి వడ్డిస్తే దాన్నేవంటారు తెలుగులో, నాకు గుర్తులేదు అన్నాడ్ట అలాటి వెధవల్ని నాలిక చీరేసి గోతిలో కప్పెయ్యాలంటారు డాక్టరు గూటాలకృష్ణమూర్తిగారు. ఇంగ్లీషు వాళ్ళకి 'కేష్' అనే 'కాసు' (.... యిచ్చాంట మనం 'కేష్' 'కాసు' లోంచి వచ్చివుండవచ్చునట.)

దసరా పజ్యాలు వెళ్ళిపోయాయి. దసరా విల్లంబులు పట్టడం. గిలకలు పట్టడం వీధిలో కోలాటాలు అన్నీ వెళ్ళిపోయి బోయీల్లేని పల్లకీలా మిగిలిపోయాం. విశ్వనాథవారిచేత ఇంకా తిట్లు తినదగిన స్థాయిలోనే వుంది మన సమాజం-వేయి పడగలు - జిందాబాద్;

# సంత్ శ్రీ అకాల్!

ముప్పైరెండేళ్ళ క్రితం - అంటే 1952లో మధ్య ప్రదేశ్‌లో 'గోండియా - జబల్పూర్' నేరోగేజ్ లైన్లో 'నైన్‌పూర్' అనే రైల్వేజంక్షన్ వూళ్ళో డి.టి.యస్. ఆఫీసులో మావారు ఓం ప్రథమంగా రికార్డు గుమస్తాగా నూట అయిదురూపాయల జీతం మీద బి.యన్.ఆర్.లో ఉద్యోగానికి దిగారు. ఆ నైన్‌పూర్ ఎలాటిదంటే అక్కడ రైల్వేక్వార్టర్సు తప్ప ప్రయివేటుగా అద్దెకు యిళ్ళు దొరకవుగాక దొరకవు. ఆ వూరికంతటికీ వో బజారు, మట్టిరోడ్డుతో - ఆపైన సంత పాకల్నీ వూరునీ చీలుస్తూ మాండలా వెళ్ళే బస్సు రూటు - సమీపంలోని ఏటిమీద వో సిమెంటు వంతెన - దేహాతీజనం, చిల్లర వ్యాపారస్థులు, కొన్ని సింధీ కొట్లూ - అవన్నీ యిప్పుడు గుర్తుచేసుకుంటూ వుంటే అట్టలు చిరిగిన పాత పుస్తకం కనిపిస్తే, హఠాత్తుగా చూస్తూన్నట్లువుంటుంది. వర్షం తగులుకుంటే ఓ వారం రోజులు భోరున అలా ఎవరో ఏడుస్తున్నట్లు పడేది. ఎండాకాలం కూడా దారుణంగా వుండేది. ఇక శీతాకాలం కోత పెట్టే చలి ఆ వూరికల్లా ఒక పంపుల చెరువు, లోకో షెడ్డు, రైల్వే యినిస్టిట్యూట్‌లు రెండూ, ఓ గురుద్వారా - అమ్మయ్య గురుద్వారా గురించి చెప్పడానికి యింత భోగట్టా ఏకరువు పెట్టాల్సి వచ్చింది.

నైన్ పూర్ రైల్వేస్టేషన్లో ఎవరుదిగినా, రైల్వే కూలీ నెత్తిమీదో, ట్రాలీ మీదో సామాన్లు వేసి అర్ధరాత్రయినా అపరాత్రయినా నడుచుకుంటూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళవలసిందే. వాహనాలు